సాక్షి సంగారెడ్డి

శనివారం ౹ 25 ౹ జనవరి ౹ 2025



గాజులపల్లి టూ ఢిల్లీ

తెలుగు భాష మీద ఉన్న అభిమానం యువకుడిని సిద్దిపేట డిగ్రీ కళాశాల నుంచి ఢిల్లీ దాక నడిపించాయి. వివరాలు 10లో ▸



రైతును బలిగొన్న చెట్టు

పొలం వద్దకు వెళ్లిన రైతును జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యంతో చెట్టు రూపంలో మృత్యువు కబళించింది. వివరాలు 10లో ▸



అర్హులను విస్మరించారు

మండలంలోని సింగితం గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ రసాభాసగా మారింది. వివరాలు 11లో ▸

ప్రగతి పరుగు.. వసతులు మెరుగు

అభివృద్ధి బాటలో మున్సిపాలిటీలు ౹ ఈనెల 26తో ముగుస్తున్న పాలక వర్గాల గడువు

జిల్లాలోని మున్సిపాలిటీలు ప్రగతి బాట పట్టాయి. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలకులు చర్యలు చేపట్టారు. నిధుల కొరత వల్ల కొన్ని ముఖ్యమైన పనులు పూర్తి చేయలేక పోయామనే అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలక వర్గాల గడువు ఈ నెల 26తో ముగుస్తుండటంతో వారు సాధించిన ప్రగతిపై ఆయా చైర్మన్, చైర్‌పర్సన్‌లతో 'సాక్షి' ముఖాముఖి..



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

ఎవరికీ దక్కని అవకాశం లభించింది



సంగారెడ్డి : రాష్ట్రంలో ఎవరికీ కలగని అవకాశం నాకే దక్కిందని నేను భావిస్తున్నాను. గత 20 ఏళ్ల నుంచి సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగడానికి సహకరించిన మున్సిపల్ అధికారులకు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు. మూడుసార్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రజలనుంచి ప్రత్యక్షంగా ఎన్నికయ్యాను. మరో నాలుగేళ్లు ప్రత్యేక పాలనలో అవే బాధ్యతలు నిర్వర్తించాను. గత ఐదేళ్లలో సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో రూ.65 కోట్ల అభివృద్ధి పనులను పూర్తి చేశాము. మరో రూ.2 కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాం. నేడో రేపు మున్సిపల్ చివరి సమావేశం నిర్వహించి ఆమోదిస్తాం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్)కింద కొన్నింటిని ఖర్చు చేశాము. మరికొన్ని నిధులు నిలిచిపోయాయి. సంగారెడ్డిలో అతిపెద్ద సమస్యగా ఉన్న డంప్ యార్డ్ పసల్‌వాడిలో ఏర్పాటైంది. ఇక చెత్త సమస్య తీరింది. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ పూర్తయితే పట్టణ ప్రజల కష్టాలు కొంతవరకు తీరుతాయి. పట్టణంలో దాదాపు లక్షన్నర జనాభా ఉండటంతో వారందరి అవసరాలకు తగినట్లుగా మౌలిక వసతులను కల్పించాం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాయి. ఐదేళ్లపాటు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని విధాలుగా నాకు సహకరించారు.

– విజయలక్ష్మి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్

అన్ని విధాలుగా అభివృద్ధి చేశా



జోగిపేట(అందోల్) : జోగిపేట మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాను. చైర్మన్‌గా తన పదవీకాలం పూర్తి సంతృప్తినిచ్చింది. బాధ్యతలు చేపట్టిన సమయంలో ఎలాంటి హామీలు ఇవ్వకుండానే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాను. ఐదేళ్లలో రూ.80 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. మున్సిపల్ పరిధిలోని 90 నుంచి 100 శాతం వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టాం. పట్టణ ప్రజలకు పుష్కలంగా మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందిస్తున్నాం. డంప్‌యార్డుకు అందోల్ శివారులోని 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి నిధులు మంజూరు చేశారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా రూ.30 కోట్లు మంజూరు చేయించారు. పారిశుధ్య కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించగలిగాం. రూ.6కోట్లతో నూతన మున్సిపల్ భవన నిర్మాణం పనులు నా హయాంలో ప్రారంభం కావడం సంతోషంగా ఉంది.

– జి.మల్లయ్య, అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్

అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేశాం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం. అన్ని కాలనీలో రూ.200 కోట్ల నిధులతో మౌలికవసతులను కల్పించాం. ఐదెకరాల్లో ఆధునిక మున్సిపల్ భవనం, కల్యాణమండపం నిర్మించాం. అన్ని కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు నిర్మించాం. నూతన సబ్ స్టేషన్, గద్దర్ ఆడిటోరియం, ప్రభుత ఆసుపత్రుల ఏర్పాటుకోసం భూమిని కేటాయించుకోగలిగాం. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి సహకారాలతో ఎంతో అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులను వెనక్కి తీసుకోవడంతో వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అదేవిధంగా చెరువుల ఆధునీకరణ పనులు ఆగిపోయాయి. మున్సిపల్ కమిషనర్ వల్ల కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కల్యాణమండపం శిలాఫలకంపై మా పేర్లులేకుండా ఉండేందుకు కొంతమంది నాయకులు కుట్రలు చేయడం బాధ కలిగిస్తోంది. కల్యాణమండపం ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్‌నాయకులు అడ్డుకోవడం దారుణం. ఇందులో మున్సిపల్ కమిషనర్ పాత్ర కూడా ఎంతో ఉందని తెలుస్తోంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి తమ పదవీ కాలం ముగిసేలోపే ప్రారంభిస్తే సంతోషంగా ఉంటుంది.

– మల్లేపల్లి లలిత, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్

న్యూస్‌రీల్

పారదర్శకత కోసమే గ్రామసభల్లో ఎంపిక

ఎమ్మెల్యే మాణిక్‌రావు



డప్పూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పారదర్శకత కోసమే సంక్షేమ పథకాల లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపికచేస్తున్నట్లు ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలు మంచివే అయినప్పటికీ అర్హులందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని డప్పూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించాలని కోరారు. లబ్ధిదారుల జాబితా చదువుతుండగా కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అధికారులు వారికి నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

పేర్లు లేకుంటే ఆందోళన పడొద్దు: కలెక్టర్

కొండాపూర్(సంగారెడ్డి): సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు లేకుంటే ఆందోళన పడాల్సిన అవసరం లేదని మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. మండల పరిధిలోని గుంతపల్లిలో జరిగిన గ్రామసభకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలో దరఖాస్తు చేసుకోని వారు మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): గ్రామ సభల్లో ఎంపికైనవారే కాకుండా నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతాయని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని శుక్రవారం పెద్దగోపులారం గ్రామసభలో ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు ఎవరికైనా మంజూరు కాకుంటే పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుని రశీదు తీసుకోవాలన్నారు. అయినా సంక్షేమ పథకాలు మంజూరు కాకుంటే తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవోలు వారి కార్యాలయాల్లోనే ఉంటారని వారి ద్వారా అయినా మంజూరు చేయించుకోవాలని సూచించారు.

4.95% అధికంగా టెం'డర్'

అంచనా వ్యయానికంటే ఎక్కువ మొత్తం

- సీఐవీఈటీ సంస్థకు దక్కిన కాంట్రాక్టు
- ఖజానాపై 6.62 కోట్ల అదనపు భారం
- సింగూరు కాలువల లైనింగ్ పనుల టెండర్ల తీరు
- అనుమతి కోసం సీఓటీకి ఫైలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సింగూరు ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల సిమెంట్ లైనింగ్ పనుల టెండర్లు ఖరారయ్యాయి. అయితే ఈ పనుల అంచనా వ్యయం కంటే ఏకంగా 4.95% ఎక్సెస్‌కు టెండర్లు దాఖలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన సీఐవీఈటీ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ సంస్థ ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ పనుల అంచనా వ్యయం రూ.168.35 కోట్లు కాగా, నీటిపారుదల శాఖ నిర్ణయించిన టెండరు విలువ రూ.133.51 కోట్లు. దీనికి ఎక్సెస్‌కు టెండర్లు దాఖలు కావడంతో ప్రభుత్వ ఖజానాపై అదనంగా సుమారు రూ.6.62 కోట్ల మేరకు భారం పడనుంది. ఈ టెండరు దక్కించుకునేందుకు సీఐవీఈటీ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు సరళా ప్రాజెక్టు వర్క్స్ ప్రైవేట్ లిమిడెట్, ఎస్ఐఏఎస్ ఇన్‌ఫ్రా అండ్ రియల్‌కాన్ ఎల్ఎల్‌పీ కంపెనీలు పోటీ పడ్డాయి. కానీ పనులు మాత్రం సీఐవీఈటీకి దక్కాయి. ఈ పనులను జిల్లా నీటి పారుదలశాఖ అధికారులు టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. ముందుగా టెక్నికల్ బిడ్, మూడు రోజుల క్రితం ప్రైస్‌బిడ్‌లు ఓపెన్ చేసిన అధికారులు ఈ కంపెనీకి టెండర్లు ఖారారు చేశారు. ఈ మేరకు అనుమతి మంజూరు కోసం నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ, కమిషనరేట్ ఆఫ్ టెండర్స్‌కు లేఖ రాశారు. ఈ అనుమతులు వచ్చిన వెంటనే సదరు కాంట్రాక్టు కంపెనీతో నీటిపారుదలశాఖ ఒప్పందం చేసుకోనుంది.



సింగూరు ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్ కెనాల్

ఇవీ పనులు..

సింగూరు ప్రాజెక్టును నిర్మించిన నాటి నుంచి ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువలతోపాటు, డిస్ట్రిబ్యూటరీలకు సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. సుమారు మూడున్నర దశాబ్దాల తర్వాత ఇప్పుడు పనులకు ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ కాలువలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించింది. ప్రాజెక్టుకు రైట్ మెయిన్ కెనాల్ 12.5 కి.మీలు, లెఫ్ట్ మెయిన్ కెనాల్ – మెయిన్‌బ్రాంచ్ కెనాల్‌లు కలిపి మొత్తం 48 కి.మీ. పొడవుంటాయి. అలాగే ఈ ప్రధాన కాలువల పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు కూడా సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టాలని భావించారు. ఈ మేరకు గతేడాది తొలి త్రైమాసికంలో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు ఇటీవల టెండరు ప్రక్రియను నిర్వహించారు. అయితే పనులు చేసేందుకు రానున్న ఖరీఫ్ సీజన్‌లో క్రాప్ హాలీడేను కూడా నీటిపారుదలశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఓటీ, ఈఎన్‌సీ నుంచి అనుమతి రాగానే కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీతో ఒప్పందం చేసుకోనున్నారు. ఈ ఆయకట్టుకు క్రాప్ హాలీడే ప్రకటించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ భావిస్తోంది.

హింసాత్మక ఘటనలను ఉపేక్షించం

- మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌పై దాడి ఘటనలో 43మందిపై కేసు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: ఎట్టిపరిస్థితుల్లోనూ హింసాత్మక ఘటనలను ఉపేక్షించేది లేదని హైదరాబాద్ మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రూపేశ్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ వినాయక్‌రెడ్డితో కలసి శుక్రవారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మీడియాతో ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ...పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి కేసులో 43 మందిపై కేసు నమోదు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన తెలిపితే ఎవరికీ అభ్యంతరం ఉండదని, హింసాత్మక ఘటనలకు పాల్పడితే మాత్రం పోలీసుశాఖ చూస్తూ ఊరుకోదని వివరించారు. కార్యకర్తలు గుంపుగా వచ్చినప్పుడు ఎవరు ఎటువెళ్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని, అందుకే వారిని సంయమనం పాటించాల్సిందిగా కోరినట్లు చెప్పారు. పోలీసుల అప్రమత్తత వల్లే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని వివరించారు. సమావేశంలో క్రైమ్ సీఐ రాజులు, ఎస్ఐలు కోటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, ఆసిఫ్ అలీ, కుర్షిత్ అలీ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నిర్మూలిస్తాం



అమృత్ పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి. చిత్రంలో కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

- ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ఏడాది పొడవునా తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.13.50 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ క్రాంతితో కలసి ఎంపీ సురేశ్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు నాగల్‌గిద్ద మండలం కారస్‌గుత్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ...బీఆర్ఎస్ హయాంలో నల్లా కనెక్షన్లు తక్కువగా చూపడం, సరైన ప్రతిపాదనలు లేకపోవడంతో ఇతర మున్సిపాలిటీలకంటే ఖేడ్‌కు నిధులు తక్కువగా వచ్చాయన్నారు. మున్సిపాలిటీకి అత్యధిక నిధులు తెప్పించి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కస్తామని చెప్పారు. నిమ్జ్‌కు సమీపంలోని నాగల్‌గిద్ద ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు రావడమే కాకుండా ఆ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని వివరించారు. కొత్త జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు, పోలీస్ బెటాలియన్ ఏర్పాటుతోపాటు జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయం ఖేడ్‌లో ఏర్పాటు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ చంద్రశేఖర్, పురపాలిక కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఉపచైర్మన్ దారంశంకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం

- ఆరుగురు చిన్నారులకు గాయాలు
- ఖేడ్ మండలం వెంకటాపూర్‌లో ఘటన
- ఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- సీడీపీవో, అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్

నారాయణఖేడ్: అంగన్‌వాడీ భవనం పెచ్చులు ఊడి పడి ఆరుగురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో 25మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. అందులో 15 మంది పిల్లలు హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభమైన కొద్దిసేపటికే పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. దీంతో లోపలే ఉన్న హారిక, మౌనిక, అంకిత, ప్రణయ్, అవినాష్, రియానికలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు సహాయంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు 108 అంబులెన్స్‌లో ఖేడ్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తలకు గాయాలు ఉండటంతో హారిక, మౌనికలను ఒకరోజు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి మిగతా చిన్నారులను డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేశ్ తెలిపారు.

రెండేళ్ల క్రితమే మరమ్మతులు

పైకప్పు పెచ్చులు ఊడిపడ్డ అంగన్‌వాడీ కేంద్రం పక్కాభవనం. ఈ భవనానికి రెండేళ్ల కిందట రూ.1.50లక్షల మండల పరిషత్ నిధులతో మరమ్మతులు చేశారని గ్రామస్తులు చెబుతున్నారు.



బాలికను పరామర్శిస్తున్న కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సీడీపీవో, అంగన్‌వాడీ టీచర్‌పై వేటు..

ప్రమాద ఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారి వసంతకుమారి, స్థానిక ఆర్డీవో అశోకచక్రవర్తి హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి చిన్నారులను సందర్శించారు. కాగా, ఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్ క్రాంతి ప్రమాద ఘటనకు బాధ్యులుగా పరిగణించి ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జీ సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ టీచర్ అంబికలను సస్పెన్షన్ చేశారు. జిల్లాలోని ప్రమాదకరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం వెంటనే అందజేయాలని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వసంత కుమారిని ఆదేశించారు.

ఓటు ప్రగతికి తొలి మెట్టు



జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ భారతదేశం, బ్యాలెట్ నమూనా, ఓటుహక్కు చిత్రాలను రావి ఆకుపై వేసి ఇలా శుభాకాంక్షలు తెలిపారు.

– నారాయణఖేడ్

సుపరిపాలనకు ఓటు వజ్రాయుధం

- నేడు జాతీయ ఓటరు దినోత్సవం
- ఓటు హక్కు వినియోగంపై అవగాహన
- ప్రచార రథంతో విస్తృతంగా ప్రచారం
- ఓటు నమోదుపై యువత ఆసక్తి

సంగారెడ్డి జోన్: దేశంలో సుపరిపాలనకు భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పాలించే పరిపాలకులను ఎన్నుకునే అవకాశం ఉంది. దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకునే విధంగా భారత ఎన్నికల సంఘం ప్రచార రథాలతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేవిధంగా అవగాహన కార్యక్రమాలు చేపడతారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ప్రతీ ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహిస్తారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు నేడు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నారు. 'ఓటును మించినదేమీ లేదు–నేను కచ్చితంగా ఓటు వేస్తా'నినాదంతో ప్రచారం చేపట్టారు. ప్రత్యేక ప్రచార రథాలను ఏర్పాటు చేసి, కళాకారులచే కళాజాత కార్యక్రమాలను నిర్వహిస్తూ, అన్ని నియోజకవర్గాల్లో అవగాహన కల్పిస్తున్నారు. నేడు జిల్లాలో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటరు నమోదు, వినియోగంపై అవగాహన

జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, ఓటరుగా నమోదు చేయించి, ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజా ప్రతినిధిని ఎన్నుకునేవిధంగా అవగాహన కల్పించటమే ఓటర్ దినోత్సవ లక్ష్యం. ప్రతీ ఏటా గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు, సంబంధిత అధికారులు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటి నుంచే ఓటు

తమ ఓటును వృథా కాకుండా, ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు పోలింగ్ కేంద్రానికి రాలేని వారి కోసం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. చేతకాని వారు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇంటి నుంచే బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.



ఓటు హక్కు వినియోగించుకున్న యువత(ఫైల్)

యువత ఆసక్తి

వార్డు నుంచి పార్లమెంట్ స్థాయి వరకు జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు యువత ఎంతో ఆసక్తి చూపుతున్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఓటును సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఓటు హక్కుపై పోటీలు

జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ముగ్గుల పోటీలను నిర్వహించారు.


మొదటిసారి ఓటు వేయబోతున్నా



త్వరలో జరిగే ఎన్నికలలో మొదటి సారి ఓటు వేయబోతున్నా. నేను ఓటు వేసి, సరైన నాయకుడిని ఎన్నుకుంటా. ఓటు వేసేందుకు ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్నా.

– సంతోష్‌కుమార్, గ్రామం, కక్కర్‌వాడ, మం.ఝరాసంగం

ప్రతీ ఎన్నికల్లో ఓటు వేశాను..



నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ప్రతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నా. ఓటుతోనే మంచిగా పరిపాలించే నాయకుణ్ణి ఎన్నుకోవచ్చు.

– కె.మాణెమ్మ, గ్రామం, కుప్పానగర్, మం.ఝరాసంగం

క్లుప్తంగా

మగ్దూంపూర్ వాసికి డాక్టరేట్

నంగునూరు(సిద్దిపేట): ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మగ్దూంపూర్ వాసి అచ్చిన పోషాద్రికి డాక్టరేట్ వరించింది. మహారాష్ట్రలోని మార్వాడా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రో బయోటిక్ ప్యాక్డ్ ఫుడ్‌పై పరిశోధన చేయడంతో డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

వీఓఏ ప్రవీణ్‌కు సుభాష్ చంద్రబోస్ లైఫ్ టైమ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ మహిళా సంఘాల వీఓఏగా పని చేస్తున్న ప్రవీణ్‌కు నేతాజీ సుభాష్ చంద్రబోస్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ కళావేదిక మీద కొమ్మూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. 18 ఏళ్లుగా మహిళా సంఘాలకు నిరంతరాయంగా చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును రావడం సంతోషంగా ఉందని ప్రవీణ్ అన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



పతకాలతో నర్సింలు

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎ.నర్సింలు జాతీయ స్థాయిలో నిర్వహించే రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ముంబాయి, హైద్రాబాద్‌లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో మొదటి బహుమతులు గెలుచుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక కావడంపై ఎంఈఓ ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జానకీ రామ్, సత్యనారాయణ ఉపాధ్యాయుడిని అభినందించారు.

షేర్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.13.58 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్ : నకిలీ షేర్ మార్కెట్ పేరిట ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి గతేడాది నవంబర్ 28న వాట్సప్ ద్వారా షేర్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు తనకు వచ్చిన లింక్‌లో వివరాలను నమోదు చేశాడు. సైబర్ నిర్వాహకులు అతడికి ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. వెంటనే ఆ ఉద్యోగి ఆన్‌లైన్‌లో కొంత నగదు పెట్టుబడి పెట్టాడు. మొత్తంగా రూ.13.58 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. చివర గా ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గాజులపల్లి టూ ఢిల్లీ

- జాతీయస్థాయిలో మెరిసిన దుబ్బాక మండలం యువకుడు
- నేషనల్ యూత్ ఫెస్ట్‌కు హాజరు
- ప్రధాని, కేంద్ర మంత్రులతో ముఖాముఖి
- రాష్ట్రం తరఫున వికసిత్ భారత్‌కి ఎంపిక
- మహమ్మద్ షాదుల్‌కి అభినందనల వెల్లువ



షాదుల్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ (ఫైల్)

దుబ్బాకటౌన్: బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు, తండ్రి మరణించిన అనంతరం తల్లి బీజన్ బీ, మేనమామ చాంద్ పాషా ప్రోత్సాహంతో తన విద్యాభ్యాసం పూర్తి చేశాడు. మరో వైపు తెలుగు భాష మీద ఉన్న అభిమానం, ఉపన్యాసంపై ఉన్న ప్రేమ సిద్దిపేట డిగ్రీ కళాశాల నుంచి ఢిల్లీ దాక నడిపించాయి. ఇంతింతై వటుడింతయై అన్నట్టు ఒక్కో మెట్టు ఎదుగుతూ గాజులపల్లి నుంచి దేశ రాజధాని ఢిల్లీ దాక అలుపెరుగని ప్రయాణం చేశాడు. వికసిత్ భారత్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ప్రధాని, కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యే అవకాశం పొందాడు. అంతటి ఘనత సాధించిన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు షాదుల్ గురించి సాక్షి ప్రత్యేక కథనం....

ఆ బిరుదే స్ఫూర్తితోనే తెలుగుపై మక్కువ

సికింద్రాబాద్‌లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసిన షాదుల్ ప్రస్తుతం తెలుగు భాష మీద ఉన్న మమకారంతో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఎ తెలుగు దూర విద్యను అభ్యసిస్తున్నాడు. గాజులపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ రెడ్డి షాదుల్ విద్యకు, హాస్టల్ , కోచింగ్ ఉన్నత చదువులకు చేదోడు వాడోదుగా నిలిచారు. జాతీయ స్థాయి వరకు వెళ్లడానికి షాదుల్‌కి స్తోమత లేక పోవడంతో ఆయనే ఆర్థిక సహకారం అందించాడు. షాదుల్ పదవ తరగతిలో తన గురువు, కవి నార్లపురం రాములు నుండి మొలదారం లేని మొగోడు అనే బిరుదు పొందాడు. ఆ బిరుదే ఈ రోజు తనకు తెలుగు భాషపై మక్కువ పెంచిందని షాదుల్ చెప్పారు .

ఆ పలు వేదికల్లో ఉపన్యాసం

- 2015 ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి యువత రంగంలో రాష్టస్థాయికి ఎంపికయ్యాడు.
- 2017 నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికై.. అప్పటి గవర్నర్ నర్సింహన్ ఎదుట ఉపన్యాసం ఇచ్చాడు.
- 2018 ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున యువ తరంగం కార్యక్రమానికి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు..
- 2018 రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో గెలుపొంది నగదు పురస్కారం అందుకున్నాడు.



షాదుల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మరువలేని అనుభూతి



నేషనల్ యూత్ ఫెస్టివల్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇస్రో చైర్మన్ డా.వీ నారాయానాన్, మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కేంద్ర మంత్రివర్యులు మనసుఖ్ మండవ్య, కిషన్ రెడ్డిలతో సమావేశాల్లో పాల్గొనడం మరువలేని అనుభూతి నింపింది. వారి సందేశాలు నన్ను చాలా ఉత్తేజపరిచాయి. భవిష్యత్‌లో మంచి స్థాయిలో స్థిరపడి మా అమ్మ, మామ కష్టానికి ప్రతిఫలం అందిస్తాను.

–షాదుల్, యువకుడు, గాజులపల్లి

మోదీ, కేంద్ర మంత్రులతో ముఖాముఖి

2024 నవంబర్ నెలలో ప్రధాని మోదీ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్–2025 కార్యక్రమం ప్రవేశపెట్టారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో యువత నైపుణ్యతను వెలికి తీయడం. 26 ఏళ్లు ఉన్న అతడి ప్రసంగాన్ని మోదీ ఆలకించారు. చివరగా పది అంశాల్లో 500 మందికి వారి ఆలోచనలను మోదీ సమక్షంలో వ్యక్తం చేసే అవకాశం కల్పించారు. అందులో సిద్దిపేట జిల్లా నుంచి షాదుల్ ఒకరవడం విశేషం. రాష్ట్రం నుంచి కార్యక్రమానికి 18 మంది పాల్గొన్నారు. మారుమూల గ్రామం గాజులపల్లి నుంచి ఢిల్లీ వరకు వెళ్లి ఆధునిక భారతదేశ అభివృద్ధిలో తన ఆలోచన వ్యక్తపరిచిన మహమ్మద్ షాదుల్‌ను గ్రామస్తులు సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.



ప్రధాని మోదీ సమక్షంలో ప్రసంగిస్తున్న షాదుల్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

లింగ ఆధారిత వివక్ష రూపుమాపాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- బాలికల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

సిద్దిపేటకమాన్: సమాజంలో లింగ ఆధారిత వివక్షను రూపుమాపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కోర్టు నుంచి విక్టరీ చౌరస్తా వరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాలికల హక్కులు, ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడానికి జాతీయ బాలిక దినోత్సవాన్ని ప్రతి ఏడాది జనవరి 24న జరుపుకుంటున్నట్లు తెలిపారు. బాలికలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, భద్రత కోసం మెరుగైన అవకాశాలను అందజేయాలని తెలిపారు. బాల్య వివాహాలు, లింగ పక్షపాతం, విద్య లేమితో సహా భారతదేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలు, సవాళ్ల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు చందన, తరణి, అదనపు కలెక్టర్ హమీద్, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు రాజలింగం, పత్రి ప్రకాశ్, భరోసా, షీ టీమ్, సఖీ సెంటర్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ప్రభుత్వ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



ఇన్ఫోసిస్ కార్యాలయం వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని తమలోని నైపుణ్యాన్ని చాటాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం సూచించారు. మహిళా కళాశాల విద్యార్థినులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులు, ట్రైనర్లతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కెరియర్‌కు అవసరమైన అంశాలు, రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌పై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభను చాటాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లక్ష్మీ, అధ్యాపకులు సరోజన, సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హన్మంతు

రాయికోడ్(అందోల్): ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిపిన కేసులో ముగ్గురిని శుక్రవారం పోలీసులు రిమాండ్ చేశారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు కథనం మేరకు.. రాయికోడ్‌లోని ఓ ప్రార్థన మందిరం సమీపంలో గ్రామానికి చెందిన సామెల్‌పై రాయికోడ్‌కు చెందిన నవరత్నం, ఏసురత్నం, మార్థమమ్మలు పాత కక్షలతో మారణాయుధాలతో సామేల్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన సామేల్ భార్య స్వరూపపై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన దంపతులను జహీరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సామేల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌లోని ఉస్మానియాకి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. సామేల్ సోదరుడు జైరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూపీసీ శ్రావణి, సిబ్బంది, శివకుమార్, సంగారెడ్డి, అశోక్, నాగరాజులు పాల్గొన్నారు.

డ్యూటీకని వెళ్లి యువకుడు అదృశ్యం



దీప్ మాన్న

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌కి చెందిన అమర్ కుమారుడు దీప్ మాన్న (26) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. 21న ఉదయం డ్యూటీ కి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం దీప్ మాన్న తల్లి సోమ మాన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గౌతమ్ నగర్‌కు చెందిన యువతి



సోనీ

యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌కు చెందిన మనోజ్ కుమార్ కూతురు కుమారి సోనీ ప్రైవేటు జాబ్ చేస్తుంది. రోజు మాదిరి గురువారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించింది. శనివారం ఉదయం లేచి చూసేసరికి కుమారి సోనీ కనిపించలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తండ్రి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోళ్ల దాణాతో వెళ్తున్న లారీ దగ్ధం



దగ్ధమవుతున్న వాహనాలు

పటాన్‌చెరు టౌన్: లారీ దగ్ధమైన ఘటన ఓఆర్ఆర్‌పై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్ర నుంచి విశాఖపట్నంకి లారీ కోళ్ల దాణాతో వెళ్తుంది. శుక్రవారం ఉదయం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ రహదారిపైకి రాగానే టైర్ల రాపిడితో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ కిందికి దిగిపోయాడు.

కారు ఢీకొట్టడంతో బైక్..

హత్నూర(సంగారెడ్డి): బైక్‌ను కారు ఢీకొట్టడంతో బైక్ దగ్ధమైన ఘటన హత్నూర మండలం పల్పనూరు గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి బోరుపట్ల గ్రామానికి చెందిన కాసాల చిరంజీవి(28) పెట్రోల్ కోసం బైక్‌పై వెళ్తుండగా పల్పనూరు శివారులో సంగారెడ్డి నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి బైక్ పూర్తిగా కాలిపోయింది. గాయపడిన చిరంజీవిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

దొంగలను పట్టించిన సీసీ కెమెరాలు

వృద్ధురాలి మెడలోంచి బంగారు ఆభరణాలు చోరీ



నిందితులను చూపుతున్న ఎస్ఐ బాలరాజు

రామాయంపేట(మెదక్): వృద్ధురాలి మెడలోంచి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బాలరాజు వివరాలు వెల్లడించారు. మండలంలోని తొనిగండ్ల గ్రామానికి చెందిన జంగంపల్లి బీరవ్వ 22న ఆస్పత్రికి వెళ్లడానికి రామాయంపేట వచ్చింది. సిద్దిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఉండగా స్థానికులైన పోచమైన సుధాకర్, మెట్టు విజయ్ ఆమె దగ్గరికి వెళ్లి ఏ గ్రామం నుంచి వచ్చావని ప్రశ్నించారు. తొనిగండ్ల నుంచి వచ్చినట్లు చెప్పింది. మేము ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బీరవ్వకు మాత్రలు ఇప్పించిన తర్వాత ఆస్పత్రి సమీపంలో ఉన్న కిరాణా దుకాణం వద్ద కూర్చోబెట్టి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కొని పారిపోయారు. సమాచారం అందుకున్న ఆమె కూతురు రామాయంపేట వచ్చి తల్లిని ఇంటికి తీసుకెళ్లింది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతును బలిగొన్న చెట్టు

- జేసీబీతో తొలగిస్తుండగా మీద పడడంతో తీవ్రగాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



జేసీబీపై విరిగిపడిన భారీ వృక్షం



బీరయ్య (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : పొలం వద్దకు వెళ్లిన రైతును జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యంతో చెట్టు రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన శుక్రవారం వెల్దుర్తి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కొడె బీరయ్య(45) తనకున్న అర ఎకరం పొలంతోపాటు కౌలుకు భూమి తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. శుక్రవారం గ్రామ శివారులోని హల్దీవాగు సమీపంలో అదే గ్రామానికి చెందిన మరో రైతు గోవింద్‌రెడ్డి పొలం వద్ద రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షాన్ని జేసీబీ సహాయంతో తొలగిస్తున్నాడు.ప్రమాదవశాత్తు చెట్టు మీద పడడంతో బీరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటనలో చెట్టు కొమ్మలు జేసీబీపై పడడంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరుగగానే జేసీబీ డ్రైవర్ పరారయ్యాడు. వెల్దుర్తి ఎస్ఐ రాజు ఘటనా స్థలానికి చేరుకొని మరో జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు. మృతుడికి భార్య సుగుణమ్మ, దివ్యాంగుడైన కుమారుడు కార్తీక్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

చోరీ కేసులో ఆరు నెలలు జైలు

కోహెడ(హుస్నాబాద్): చోరీ కేసులో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. 2024 మార్చిలో పెద్దమ్మ ఆలయంలో బస్వాపూర్‌కు చెందిన బోదాసు యాదగిరి, మద్దూర్ మండలం దూల్మిట్టకు చెందిన ఆలెపు శేఖర్ బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారు. గ్రామానికి చెందిన పొన్నం అంజయ్య ఫిర్యాదు మేరకు దొంగలను అరెస్ట్ చేశాం. జ్యుడిషల్ రిమాండ్‌కు తరలించగా కేసు కొనసాగుతుంది. ఇద్దరు నిందితులపై శుక్రవారం నేరం రుజువు కావడంతో హుస్నాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణతేజ ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. నేరస్తులకు శిక్ష పడడానికి కృషి చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, ఎస్ఐ అభిలాష్, పీసీ సంజీవ్‌లను సిద్దిపేట సీపీ అనురాధ, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ శ్రీనివాస్ అభినందించినట్లు తెలిపారు.

రైలులో నుంచి కిందపడి తీవ్రగాయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైలులో నుంచి కిందపడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెల్లాపూర్, లింగపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. కొల్లూరు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన సలీం గురువారం సికింద్రాబాద్‌కు వచ్చేందుకు కర్ణాటక రాష్ట్రంలోని సేడం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. గురువారం రాత్రి తెల్లాపూర్ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైలులో నుంచి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సలీంను ఆస్పత్రికి తరలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో సలీం రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి.

ఆది మానవుల రాతి చిత్రాలు లభ్యం



రేఖా చిత్రాలను చూపుతున్న సంతోష్

కొల్చారం/పాపన్నపేట(నర్సాపూర్): కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు లైబ్రేరియన్ బుర్ర సంతోష్ పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లి ఏడు పాయల వన దుర్గ సన్నిధికి వెళ్లే మార్గంలోని గుట్టల్లో ఆది మానవుల రాతి చిత్రాలను గుర్తించినట్లు తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ రాతి చిత్రాల్లో రంగు నింపిన పెద్దబొమ్మ, ఒక చేప, మచ్చల జంతువులు, పెద్ద సూర్యుడు, ఎముకలు, రెండు కంగారు వంటి జంతువులు, మాస్కు ధరించిన ఒక పెద్ద మానవరూపం, వజ్రాకార డిజైన్ వంటి పలు చిత్రాలను గుర్తించారు. ఈ రాతి చిత్రాల శైలి, ఎరుపు రంగులో చిత్రించబడ్డ పద్ధతి చూస్తే వీటి కాలం మధ్య రాతియుగంగా గుర్తించవచ్చని రాతి చిత్రాల నిపుణుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సలహాదారుడు బండి మురళీధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- రూ.2.38కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నూతన రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరా ప్రారంభం



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, తదితరులు

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డి పేట, పటేల్ గూడ, సుల్తాన్ పూర్,ఐలాపూర్, ఐలాపూర్ తాండ, దయారా పరిధిలో రూ.2.38కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పటేల్‌గూడ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ నుంచి మంచి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జస్ట్ డయల్, పేటీఎం, టెక్ మహీంద్రా సంస్థలు నిర్వహించిన జాబ్‌మేళా ముగింపు కార్యక్రమానికి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నూ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు జాబ్‌మేళాను నిర్వహించడం సంతోషదగ్గ పరిణామం అన్నారు. కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, జలమండలి జీఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.